
పెనుకొండలో మామిడి ఆకుల కొనుగోలు

నేడు ఉగాది


పండుగ కొనుగోళ్లతో కిక్కిరిసిన పెనుకొండలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్


హిందూపురంలో జోరుగా పూల విక్రయాలు



జిల్లావ్యాప్తంగా సందడి... షాపింగ్‌తో జనం బిజీబిజీ
కిక్కిరిసిన దుకాణాలు, రోడ్లు... స్తంభించిన ట్రాఫిక్

హిందూపురం అర్బన్: తెలుగు వారికి ప్రధానమైనది ఉగాది పండుగ. తెలుగు సంవత్సరాదిన వచ్చే పండుగను ఘనంగా చేసుకుంటారు. కుటుంబీకులంతా నూతన వస్త్రాలు ధరించి, ఇంటిని పచ్చటి తోరణాలతో అలంకరించుకుంటారు. షడ్రుచులు సమ్మేళనమైన ఉగాది పచ్చడి చేసుకుని, ఆరగిస్తారు. పిండివంటలు చేసుకుని కుటుంబికులు, బంధువులు ఆరగిస్తారు. పంచాగ శ్రవణం ముఖ్యమైనది. అలాంటి ఉగాది పండుగ మంగళవారం కావడంతో జిల్లావ్యాప్తంగా సందడి నెలకొంది. జిల్లా ప్రజలు సోమవారం పూజాసామగ్రి, సరుకులు, దుస్తుల కొనుగోళ్లతో బిజీబిజీగా కనిపించారు. పట్టణాల్లో షాపులు, వీధులు కిటకిటలాడాయి. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా జనం కొనుగోళ్లలో బిజీగా కనిపించారు. దీంతో పట్టణ రోడ్లలో ట్రాఫిక్ గంటలపాటు స్తంభించింది.

జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు

పుట్టపర్తి, ఏప్రిల్ 8: శ్రీక్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజలకు అన్నీ శుభాలే కలగాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆకాంక్షించారు. సోమవారం ఓ ప్రకటనలో జిల్లా ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లో ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు.

ఎస్పీ మాధవరెడ్డి...

పుట్టపర్తి రూరల్: జిల్లా ప్రజలకు ఎస్పీ మాధవరెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. శ్రీకోధినామ సంవత్సరంలో జిల్లా ప్రజలకు అన్నీ శుభాలే కలగాలని ఆకాంక్షించారు. ఈ ఉగాది పండుగతో అందరి జీవితాల్లో వెలుగులు రావాలనీ, అందరూ సంతోషంగా జీవించాలని కోరారు.

చెన్నకేశవుడి పాదాలు తాకిన సూర్యకిరణాలు


స్వామివారి మూలవిరాట్‌పై పడిన సూర్యకిరణాలు

తాడిమర్రి, ఏప్రిల్ 8: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీతారమా చెన్నకేశవస్వామి మూలవిరాట్ పాదాలను సూర్యకిరణాలు తాకాయి. ఏటా బ్రహ్మోత్సవాలకు పదిరోజుల ముందు కనీసం రెండు, మూడు రోజులపాటు సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తాకడం ఆనవాయితీ. ఈనెల 23న బ్రహ్మరథోత్సవం నేపథ్యంలో ఆలయం వద్ద ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆది, సోమవారాల్లో ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తాకాయని వేదపండితుడు సంతోష్‌శర్మ తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వద్దు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టరు అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఏప్రిల్ 8: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి.. జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడలోని తన కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టరు అరుణ్‌బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టిన తాగునీటి సరఫరా చర్యలను కలెక్టర్ వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై సీఎస్‌కు వివరించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

20 రోజులైనా నీరివ్వరా?

మహిళల మండిపాటు... సచివాలయం ముట్టడి


సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

మడకశిరటౌన్, ఏప్రిల్ 8: నీటి కోసం పట్టణ వాసులు నిరసనకు దిగారు. 20 రోజులైనా నీరివ్వకుంటే ఎలా అని గాంధీబజార్, బోయగేరి, కంసలవీధి, వీరభద్ర స్వామిగుడి తదితర కాలనీల వాసులు మండిపడ్డారు. సోమవారం సచివాలయాన్ని ముట్టడించారు. స్థానికులు సుజాతమ్మ, తిమ్మక్క, నాగలక్ష్మమ్మ, నాగమణి మాట్లాడుతూ.. అధికారులు మంచినీరు సక్రమంగా సరఫరా చేయరనీ, కనీసం ఉప్పునీరైనా అందించాలని ఆవేదన వ్యక్తం చేశారు. 8, 9 వార్డుల్లో నెల రోజుల నుంచి నీరు సక్రమంగా రావడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని సచివాలయ ఉద్యోగులు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

- సెబ్ డీసీ నాగమద్దయ్య

పెనుకొండ, ఏప్రిల్ 8: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు సెబ్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) నాగమద్దయ్య తెలిపారు. స్థానిక సెబ్ స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అక్రమంగా మద్యం నిలువ ఉంచిన గోదాములు, అక్రమ రవాణా మార్గాలు, కేంద్రాలను తనిఖీ చేస్తున్నామన్నారు. పాత నేరస్థులపై నిఘా ఉంచామన్నారు. సరిహద్దు చెక్‌పోస్టులను బలోపేతం చేసి, అక్రమ మద్యం కట్టడికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి సెబ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, పెనుకొండ సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు (సోమ)	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	40.0	24.0
కదిరి	41.0	23.0
ధర్మవరం	41.0	25.0
హిందూపురం	38.0	23.0
పెనుకొండ	39.0	24.0

రంజాన్ వేళలు	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.36 మంగళవారం (సాయంత్రం)	4.47 బుధవారం (ఉదయం)
కదిరి	6.33 మంగళవారం (సాయంత్రం)	4.54 బుధవారం (ఉదయం)
ధర్మవరం	6.38 మంగళవారం (సాయంత్రం)	4.51 బుధవారం (ఉదయం)
హిందూపురం	6.36 మంగళవారం (సాయంత్రం)	4.55 బుధవారం (ఉదయం)
పెనుకొండ	6.34 మంగళవారం (సాయంత్రం)	4.51 బుధవారం (ఉదయం)

చెరువులు నింపేది బూటకమే..

● ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి అంతసీన్ లేదు ● బీసీ సదస్సులో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర


అమడగూరులో టీడీపీలో చేరినవారితో పల్లె సింధూర

కదిరి, ఏప్రిల్ 8: పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులు నింపుతామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రజలకు చెబుతున్న మాటలు బూటకమేనని, అతడికి అంత సీన్ లేదని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి ఎద్దేవా చేశారు. అమడగూరు మండలకేంద్రంలోని చౌడేశ్వరీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన జయహో బీసీ సదస్సులో ఆమె భర్త పల్లె వెంకటకృష్ణకిశోర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్‌తో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు ప్రధానవీధుల్లో రోడ్ షో చేశారు. తర్వాత బీసీ సదస్సులో పాల్గొన్నారు. పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ప్రజా సంక్షేమాన్ని సీఎం జగన్ పూర్తిగా మరచిపోయారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేసే చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. గడిచిన ఐదేళ్లలో పుట్టపర్తి నియోజకవర్గంలోని 193చెరువులకు నీరు నింపలేని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఇప్పుడు వచ్చి నీరు నింపుతాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలు వచ్చాయని బూటకపు మాటలు చెబుతున్నారని దుయ్యబట్టారు. ఆయన మాటల్ని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. అప్పటి సీఎం చంద్రబాబు హంద్రీనీవా జలాలు తీసుకురావడానికి డీపీఆర్ ప్రాజెక్టుకు రూ.3.40కోట్లు విడుదల చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. తర్వాత వైసీపీ మాజీ కన్వీనర్‌రాజారెడ్డితోపాటు వందమందికుటుంబాల వారు ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరారు. వారికి సింధూరా రెడ్డి, కృష్ణకిశోర్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, తెలుగుయువత నాయకులు శ్యామ్ బాబు, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, భాస్కర్, గోవిందు, రెడ్డెప్ప, నంజప్ప, రమణ, గాయత్రి, రామాంజునేయులనాయుడు, గీతాంజలి, రామాంజనేయులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి గెలుపునకు సమష్టిగా కృషి చేద్దాం: పల్లె

పుట్టపర్తి: సమష్టిగా పనిచేసి కూటమిని గెలిపించుకుందామని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. అవినీతి పాలనను అంతమొందించాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఇందుకు అందరం సమష్టిగా పని చేయాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ బెస్తచలపతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం

బుక్కపట్నం: టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆయన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ముస్లింమైనార్టీలను పట్టించుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే మైనార్టీలకు మళ్లీ మంచిరోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్, టీడీపీ ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ముతవల్లిలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి మహిళల చేరిక

కొత్తచెరువు: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన 30 కుటుంబాలకు చెందిన మహిళలు మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ ఒలిపిశీన, నాయకులు సుమలత నాగేంద్ర, డిపో భాస్కర్, డ్రైవర్ కేశప్ప, ఎస్సీసెల్ నాయకుడు పెద్దన్న, మహిళా నాయకులు రాధ, మణి, తులసి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

● ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట

కదిరి, ఏప్రిల్ 8: చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని, ఆయన సీఎం అయితేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. తలుపుల మండలం నూతన కాలువ పంచాయతీలోని తొగటవారిపల్లి, దండువారిపల్లి, చింతకాయలపల్లి, నూతనకాలువ గ్రామాలతోపాటు జొన్నాకాలనీ, ఎస్సీకాలనీలలో సోమవారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలకు ఆయనకు ఘనస్వాగతం పలికారు. మహిళలు ఎదురేగి హారతులు పట్టారు. తర్వాత ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు రూ.నాలుగువేలు పింఛన్ అందిస్తామన్నారు. మినీమేనిఫెస్టో పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. కనుక టీడీపీ , బీజేపీ, జనసేన కూటమిని అభ్యర్థులను గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


తొగటవారిపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కందికుంట

వైసీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

● టీడీపీ ఆత్మీయ సమావేశంలో పరిటాల శ్రీరామ్ ● పాల్గొన్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్

ముదిగుబ్బ, ఏప్రిల్ 8: వైసీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎన్నికల్లో ఆ పార్టీని ఇంటికి పంపడం ఖాయంగా కనిపిస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన టీడీపీ మండల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందుకు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ హాజరై మాట్లాడారు. ధర్మవరాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... సత్యకుమార్ పేరు ప్రకటించినప్పటి నుంచి ఎమ్మెల్యే కేతిరెడ్డికి నిద్ర పట్టడం లేదన్నారు. సత్యకుమార్‌కు ధర్మవరం సందుల గురించి తెలియకపోవచ్చు కానీ. ప్రజా సమస్యలు బాగా తెలుసునని, వాటిని ఎలా పరిష్కరించాలో కూడా తెలుసునని అన్నారు. త్వరలోనే వైసీపీ ప్రజలు గుణ పాఠం చెప్పనున్నారని, వచ్చేది టీడీపీ కూటమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో కదిరి మాజీ ఎమ్మెల్యే ఎమ్మెస్ పార్థసారథి, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

పడమటి ఈరన్న ఉత్సవాలు ప్రారంభం


ఎద్దుల బండితో ప్రదక్షిణ చేస్తున్నరైతులు

తాడిమర్రి, ఏప్రిల్ 8: ఉగాది పండుగ సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే పడమటి ఈరన్న ఉత్సవాలు సోమవారం మొదలయ్యాయి. పసుపతి నాథుడుగా పేరు గాంచి మండలంలోని ఆత్మకూరు గ్రామంలో వెలసిన పడమటి ఈరన్నస్వామి ఆలయం ఎద్దులబండ్లను, పశువులను ఉగాది పండుగ ముందు రోజు ప్రదక్షిణలు చేయించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా తాడిమర్రి మండలంలోని పలు గ్రామాల రైతులు ఎద్దులబండ్లను అందంగా అ లంకరించి స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామిని దర్శించుకుని పూజలు చేయించి మొ క్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలు వారం రోజులు కొనసాగుతాయని, ఉగాది రోజు అధికసంఖ్యలో భక్తులు హా జరై మొక్కుబడులు తీర్చుకుంటారని గ్రామస్థులు తెలిపారు.

జుంజప్పస్వామికి ఘనంగా పూజలు

గుడిబండ, ఏప్రిల్ 6: కర్ణాటక రాష్ట్రంలోని శిర తాలూకా కళూరుహళ్లి సమీపంలో వెలసిన జుంజప్పస్వామి, కుర్లహళ్లిభూతప్పస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పూజారిపల్లి, ఎస్‌రాయాపురం, హేమావతి, నాగేపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు సోమవారం జుంజప్పస్వామి ఆలయానికి పెద్దఎత్తున చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పోలీసు కవాతు


కవాతు చేస్తున్న పోలీసులు

నల్లమాడ, ఏప్రిల్ 8: మండలకేంద్రంలో సోమవారం పోలీసులతో పాటు బీఎస్‌ఎఫ్ సాయుధ బలగాలు సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. పురవీధుల్లో కవాతు చేశారు. సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకూడదన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజల్లో ఈ మేరకు ధైర్యం కల్పించేందుకే కవాతు చేపట్టామని తెలిపారు. ఎస్‌ఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలకు సమాచార హక్కు చట్టం కమిషనర్


సమాచార హక్కుచట్టం కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి, ఏప్రిల్ 8 రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి సోమవారం పుట్టపర్తికి వచ్చారు. ప్రశాంతి నిలయంలో ఆయనకు ఆర్డీఓ భాగ్యరేఖ, ఇతర అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయన రాత్రికి శాంతిభవన్‌లో బస చేయనున్నారు. మంగళవారం ఉదయం సాయికుల్వంత్ హాల్లో జరిగే ఉగాది వేడుకల్లో పాల్గొననున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పరిశీలించండి: జేసీ

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పరిశీలించుకోవాలని ఆయా సెక్టోరియల్ అధికారులకు జేసీ అభిషేక్‌కుమార్ సూచించారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెక్టోరియల్ అధికారుల సమావేశంలో మాట్లాడారు. అదే విధంగా హిందూపురం అసెంబ్లీ పరిధిలోని అర్బన్ ప్రాంతంలో దండురోడ్డు, ముద్దిరెడ్డిపల్లి, అరవింద్‌నగర్ పరిధిలోని 25, 26, 27, 28, 29 పోలింగ్ బూత్‌లలో ర్యాంపు, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల తహసీల్దార్లు మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎన్నికల డీటీ రెడ్డిశేఖర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

ధర్మవరం అభివృద్ధికి కృషి చేస్తా

● ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థి సత్యకుమార్

ధర్మవరం, ఏప్రిల్ 8: ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన ఐటీ ప్రొఫెషనల్స్, ఐటీడీపీ, సీబీఎన్ ఆర్మీ, బెంగళూరు టీడీపీ ఫోరం, తెలుగు ప్రొఫెషనల్స్ వింగు సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధర్మవరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానన్నారు. ఇందుకు ఐటీ నిపుణులు, విద్యావంతులు కలిసి రావాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్రం సాయంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో కూటమి విజయానికి సహకారం అందించాలని కోరారు.

శివాలయంలో సత్యకుమార్ ప్రత్యేక పూజలు

ధర్మవరం: పట్టణంలోని తిక్కస్వామినగర్‌లో గల శివాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శివుడిని దర్శించుకుని అర్చన చేయించారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాపుల్లయ్య, జింకా చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి చేరిన ఎంపీపీ ఆదినారాయణ యాదవ్

ముదిగుబ్బ: వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ బీజేలోకి చేరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ సోమవారం ముదిగుబ్బ మండల కేంద్రానికి వచ్చి తిరిగి ధర్మవరం వెళుతూ మండలంలోని బి.కొట్టాల గ్రామంలో గల ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ఇంటికి వెళ్లి మద్దతు కోరి బీజేపీలోకి ఆహ్వానించారు. దీంతో వెంటనే ఆయన సత్యకుమార్ ఆధ్వర్యంలో బీజేపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్దకు రాలేని వారిని గుర్తించండి

ధర్మవరం, ఏప్రిల్ 8: పట్టణ, రూరల్ ప్రాంతాలలో పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి ఓటు వేయలేని పరిస్థితిలో ఉన్న వికలాంగులు, 85 ఏళ్ల దాటిన వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని సెక్టార్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్దకు రాలేని వారిని గుర్తించి ఫారం-12 నమోదు చేయించాలని తెలిపారు. దీని ప్రకారం వారు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, తహసీల్దార్ రమేశ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ఆర్ఓ వెంకటశివరామిరెడ్డి

అగ్ని ప్రమాదంలో వ్యవసాయ సామగ్రి దగ్ధం

● రూ. 3 లక్షలు నష్టం

తనకల్లు, ఏప్రిల్ 8: మండలంలోని పోకనాటుపల్లిలో రైతు వెంకటరమణారెడ్డికి చెందిన వ్యవసాయ పొలంలో గల గోడౌన్‌లో సోమవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగి అందులో ఉన్న పైపులు, డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు కాలి బూడిదయ్యాయి. దీంతో రూ. 3లక్షల మేర నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు. మంటలను అదుపు చే యడానికి గ్రామస్థులు ప్రయత్నించగా సాధ్యపడలేదు. అన్నమయ్య జిల్లా ములకలచెరువుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కాలిపోతున్న వ్యవసాయ పరికరాలు

పేద ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ధర్మవరం, ఏప్రిల్ 8: పట్టణంలోని పేద ముస్లింలకు నిత్యావసర సరుకులను హజరత్ టిప్పుసుల్తాన్ ఖిద్మత్ బృందం సభ్యులు సోమవారం పంపిణీ చేశారు. స్థానిక పీఆర్‌టీ సర్కిల్‌లోని ఫంక్షన్‌హాల్‌లో రంజాన్ సందర్భంగా 120 మందికి నిత్యావసర సరుకులు అందజేశారు.

సూపర్ సిక్స్ పథకాలపై ముమ్మర ప్రచారం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 8: మండలంలోని తుమ్మలకుంట్లపల్లి పంచాయతీ చెర్లోపల్లిలో సోమవారం టీడీపీ మైనార్టీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు సీఎం అవగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తారని తెలిపారు. ఈ పథకాల వల్ల కుటుంబంలోని ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని వివరించారు. అలాగే ముస్లింల ఇళ్ల వద్దకు వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వస్తే నిలిచిపోయిన రంజాన్ తోఫా, దుల్హాన్ తదితర పథకాలన్నీ మళ్లీ అమలవుతాయని పేర్కొన్నారు. కనుక వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించుకుందామని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో మైనార్టీ మండలాధ్యక్షుడు చికెన్ షానూ, నాయకులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి, పాతబత్తలపల్లి, వంకరకుంట గ్రామాల్లో సూపర్ సిక్స్‌పథకాలపై టీడీపీ నాయకులు ఇంటింటా తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. మొదట బీసీలు ఐక్యతా సమావేశం నిర్వహించారు. అనంతరం సూపర్ సిక్స్‌పథకాల గురించి ప్రచారం చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే చేపట్టనున్న పథకాలపై ప్రజలకు వివరించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డిని, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండలకన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: మండలంలోని ముష్టిపల్లి, రామాపురం, పత్తిగడ్డ గ్రామాల్లో టీడీపీ, జనసే, బీజేపీ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. చంద్రబాబు సీఎం కాగానే పథకాలన్నీ అమలవుతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గంగులప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


చెర్లోపల్లిలో సూపర్ సిక్స్‌పై ప్రచారం చేస్తున్న టీడీపీ మైనార్టీ నాయకులు

దొంగచాటుగా వైసీపీ రంజాన్ తోఫా పంపిణీ

● పలువురు ముస్లిం నాయకుల ఆరోపణ

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 8 : అధికార పార్టీ వైసీపీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో దొంగచాటుగా మైనార్టీలకు రంజాన్‌తోఫా పంపిణీ చేస్తున్నారని పలువురు స్థానిక మైనార్టీ నాయకులు మండిపడ్డారు. వారు సోమవారం పట్టణంలోని దర్గా సమీపంలో విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ వైసీపీ అధికారం లోకి వచ్చినప్పటి నుంచి మైనార్టీలకు రంజాన్‌తోఫా పంపిణీ చేయలేదన్నారు. కానీ నేడు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ముస్లింల ఓట్లకోసం వారికి రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. ఇదే క్రమంలో పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత నాలుగేళ్లపాటు పబ్లిక్‌గా సమావేశాలు ఏ ర్పాటుచేసి ముస్లిం మైనార్టీలకు రంజాన్ పండు సందర్భంగా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారన్నారు. ఇప్పటికైనా మైనార్టీలను ఓట్ల కోసం వినియోగించకోకుండా, వారి బాగుకోసం పాటుపడాలని హితవుపలికారు. వైసీపీ తీరుపై మైనార్టీలు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్ర మంలో మైనార్టీ నాయకులు జఫ్రుల్లా, షౌకత్, షామీర్, నజీర్, షమున్, దాదు తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వెనుక సోమవారం పేకాట ఆడుతున్న పలువురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 20,050 నగదు, మూడు ద్విచక్రవాహనాలు, కారు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వెనుక పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందని, దీంతో వెంటనే సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు చేశామని తెలిపారు. అందులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి కేసున మోదు చేసినట్టు ఎస్‌ఐ వివరించారు.

యువత శ్రమదానం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 8: రంజాన్ పవిత్రమాసాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలో ఈద్గా ప్రాంతానికి చెందిన యువత సోమవారం శ్రమదానం చేశారు. అక్కడ పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించడంతో పాటు ఈద్గాకు రంగులు వేసి పండుగకు ముస్తాబు చేశారు. యువత బాబ్‌జాన్, మైనూ, ఆసిఫ్, షారూక్, ఆర్ఫీ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ధర్మవరం, ఏప్రిల్ 8: కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఏర్పా టు చేసిన చలివేంద్రాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం విపరీతమైన ఎండలు ఉన్నాయని, దీంతో ప్రజలు వేడిమితో అల్లాడుతున్నారని అన్నారు. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి ఈ చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్‌ఈఈ సత్యనారాయణ, డీఈ వన్నూరుస్వామి, ఏఈ హరీశ్ పాల్గొన్నారు.

వలంటీర్లా.. వైసీపీ కార్యకర్తలా..?



ఫొటోలో కనిపిస్తున్న మహిళలంతా నార్పల వలంటీర్లే...

నార్పల, ఏప్రిల్ 8: ఎన్నికల నిబంధలను ఉల్లంఘిస్తూ తమనెవరూ అడ్డుకోలేరంటూ కొందరు మహిళా వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలో వైసీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి తన స్వగృహం వద్ద వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి నార్పలకు చెందిన కొందరు మహిళా వలంటీర్లు హాజరయ్యారు. ఈ ఫొటోలో కనిపిస్తున్న వారంతా మహిళా వలంటీర్లు కావడం గమనార్హం. వీరు కాకుండా మరికొందరు వలంటీర్ల కూడా హాజరైనట్లు తెలిసింది. సమావేశంలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులును గెలపించేలా వలంటీర్లు కృషి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి వలంటీర్లు హాజరవ్వడం సర్వత్రా చర్చనీయంశంగా మారింది.

పనిచేయించుకుని జీతాలు ఎగ్గొట్టారు

- ఎస్పీకి యోగా టీచర్ల ఫిర్యాదు



ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న యోగా టీచర్లు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 8: యోగా టీచర్ ఉద్యోగం పేరుతో పని చేయించుకుని జీతాలు ఇవ్వకుండా మోసం చేశారని, తమకు న్యాయం చేయాలంటూ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డికి యోగాటీచర్లు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లాపోలీసు కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, యోగా టీచర్లు సతీష్, శివకుమారి, లలిత, హరినాయక్ సోమవారం ఎస్పీని కలిశారు. వారు మాట్లాడుతూ.. గుంటూరుకు చెందిన బుద్ధా ఫౌండేషన్ యోగా సెంటర్లను జిల్లాలో ఏర్పాటు చేసిందన్నారు. యోగా టీచర్లుగా తమ సేవలను 15 నెలలు ఉపయోగించుకుని ఆ సంస్థ చైర్మన్ తమకు రావాల్సిన రూ.15 లక్షల జీతాలు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు. తాము ఆ సంస్థలో 15 నెలలపాటు ఉద్యోగం చేశామన్నారు. తమకు రావాల్సిన జీతాలు ఇవ్వకుండా సంస్థ మోసం చేసిందన్నారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ విచారించి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హుబ్లీ, విజయవాడ మధ్య ఉగాది ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఏప్రిల్ 8: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రైళ్లలో ప్రయాణికుల రద్దీ నిరయంత్రణ కోసం హుబ్లీ-విజయవాడ-హుబ్లీ మధ్య (వయా గుంతకల్లు, బళ్లారి) ఓ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ-హుబ్లీ (నెం.07001) ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేదీన విజయవాడలో మధ్యాహ్నం రెండున్నరకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7-10 గంటలకు హుబ్లీకి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం.07002) ఈనెల 11వ తేదీన హుబ్లీలో ఉదయం 9-25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 1 గంటకు విజయవాడకు చేరుతుందన్నారు. ఈ రైలు గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, దొణకొండ, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుంతకల్లు, బళ్లారి, తోరణగల్లు, హోసపేట, మునీరాబాద్, కొప్పళ, గదగ్, అనిగిరి స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

ఆధారాలు లేని నగదు స్వాధీనం

ధర్మవరం, ఏప్రిల్ 8: ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1,78,020 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి కృష్ణారావు సోమవారం తెలిపారు. పట్టణంలోని ఎర్రగుంట్ల సర్కిల్లో ఆదివారం తాము సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టామని అన్నారు. పుట్లూరు మండలం కొండాపురానికి చెందిన అశోక్‌నాయుడిని తనిఖీ చేయగా రూ.1,78,020 నగదు లభ్యమైందని తెలిపారు. నగదు ఎక్కడిదో ఆధారాలు చూపలేదని, దీంతో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎలాంటి ఆధారాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదును ఎవరూ తరలించరాదని సూచించారు. నగదు తీసుకువెళ్లేవారు అందుకు సంబంధించిన ఆధారాలను వెంట తీసుకుని రావాలని సూచించారు.

జీవిత ఖైదు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్8: పట్టణంలోని నందలపాడుకు చెందిన కాసి పోగుల వెంకటేశ్వర్లుకు అనంతపురం కోర్టు జీవిత ఖైదుతోపాటు రూ.2500 జరిమానా విధించినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. నందలపాడులో నివాసం ఉంటున్న కాసిపోగుల వెంకటేశ్వర్లు మద్యం మత్తులో 2020 జూలై 4న ఓ బాలికపై అత్యాచారం చేశాడని కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన కోర్టు, నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవితఖైదు విధించిందని పోలీసులు తెలిపారు.

సెట్ చేసుకోవాల్సిందే

ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించాలంటే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) రాయాల్సిందే. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులు. సెట్ నిర్వహణ ప్రక్రియను రాష్ట్ర ఉన్నత విద్యామండలి వివిధ యూనివర్సిటీలకు అప్పగించింది. ఒక్కో యూనివర్సిటీ ఒక్కో సెట్‌ను నిర్వహిస్తోంది. అయితే ఏ సెట్ ఎవరు నిర్వహిస్తున్నారు, దరఖాస్తులకు అర్హులెవరు, పరీక్షలెప్పుడు వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనతో సరిపెట్టింది. మరోవైపు ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు సెట్‌లకు లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ కోచింగ్ పేరుతో దోపిడీకి తెరలేపారని ఇటు విదార్థుల తల్లిదండ్రులు, అటు విద్యార్థి సంఘాలు ప్రభుత్వంపై మండిపడుతున్నాయి. తరగతులు నిర్వహిస్తున్న సమయంలోనే సంబంధిత విద్యార్థులు పైకోర్సులకు ఎలా వెళ్లాలి? ఏఏ సెట్‌లు రాయాలన్న అవగాహన కల్పించడంలేదని వాపోతున్నాయి. ప్రతి ఏటా గందగోళానికి గురికావాల్సి వస్తోందని పేర్కొంటున్నాయి. విద్యార్థులు వారి ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఏఏ సెట్‌లు రాయాలో వివరాలు మీకోసం...

- అనంతపురం సెంట్రల్




- డిగ్రీ నుంచి పీహెచ్‌డీ వరకు కామన్ ఎంట్రెన్స్
- ఏ కోర్సులో చేరాలన్నా.. సెట్‌లో అర్హత సాధించాలి
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

పీజీఈసెట్..



బీటెక్, బీఫార్మసీ, బీఆర్క్, ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎంసీఏ వంటి డిగ్రీ కోర్సులు అభ్యసించిన విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ)లో చేరడానికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(పీజీఈసెట్) పరీక్షల్లో అర్హత సాధించాలి. దీనిని వెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ శ్రీకాంత్‌రెడ్డి, కన్వీనర్‌గా ప్రొఫెసర్ రామశ్రీ, కో-కన్వీనర్‌గా దివాకర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. పరీక్షలు రాయడానికి 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలస్యమైన వారు మే 12వరకు ఫైన్‌తో దరఖాస్తుచేసుకోవాలి. దరఖాస్తుల్లో తప్పిదాలను 14 వరకు సరిచేసుకునే అవకాశముంది. అభ్యర్థులు వారి హాల్‌టికెట్స్‌ను 22నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 29 నుంచి 31వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. వివరాలకు 7382058455 లేదా helpdeskappgecet@apsche.orgకు మెయిల్ చేయాలి.

ఈఏపీసెట్...



బీటెక్‌లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్‌తోపాటు బీఫార్మసీ ప్రవేశాలకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ(ఈఏపీ)సెట్ నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియేట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. జేఎన్‌టీయూ కాకినాడ సెట్‌ను నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ ప్రసాద్‌రాజు, కన్వీనర్‌గా ప్రొఫెసర్ వెంకటరెడ్డి, కో-కన్వీనర్లుగా ప్రొఫెసర్ మోహన్‌రావు, ప్రొఫెసర్ నాగేశ్వరరావు వ్యవహరిస్తున్నారు. అర్హతగల విద్యార్థుల నుంచి ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తులో ఏవైనా తప్పిదాలుంటే మే 6వరకు కరెక్షన్ చేసుకోవచ్చు. మే 12 వరకు ఫైన్‌తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్నవారు మే 7 నుంచి ఆన్‌లైన్‌లో వారి హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 16, 17న అగ్రికల్చర్, ఫార్మసీ. 18 నుంచి 22వరకు ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. వివరాలకు 0884-2359599, 2342499 నెంబర్లకు ఫోన్‌చేయాలి. helpdeskapeapcet@apsche.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

ఈసెట్...



డిప్లమో కోర్సులు పూర్తిచేసిన వారికి బీటెక్, బీఫార్మసి, అగ్రికల్చర్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాలను కల్పించేందుకు ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఈసెట్)ను జేఎన్‌టీయూ అనంతపురం నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ శ్రీనివాసరావు, కన్వీనర్‌గా ప్రొఫెసర్ భానుమూర్తి, కో-కన్వీనర్లుగా ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ దిలీప్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. అర్హతగల విద్యార్థులు 15 వరకు దరఖాస్తుచేసుకోవాలి. 25 నుంచి 27వరకు దరఖాస్తుల్లో తప్పిదాలను సరిచేసుకోవచ్చు. ఫైన్‌తో మే 2 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మే 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 8న పరీక్షలు నిర్వహించి 10న ప్రిలిమినరీ కీ విడుదల చేయనున్నారు. వీటిపై అభ్యంతరాలుంటే 12 వరకు ఫిర్యాదు చేయవచ్చు. వివరాలకు 08554232622 లేదా helpdeskapecet@apsche.org కు మెయిల్ చేయాలి.

పీజీసెట్...



బీఏ, బీకామ్, బీఎస్సీ తదితర డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ వంటి పీజీ కోర్సుల్లో ప్రవేశాలను కల్పించేందుకు విశాఖలోని ఆంధ్రయూనివర్సిటీ.. పీజీసెట్‌ను నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్‌గా ప్రొఫెసర్ శశిభూషణ్ రావు వ్యవహరిస్తున్నారు. ఇందుకు మే 4వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. 25 వరకు ఫైన్‌తో దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తులో తప్పిదాలను 30 వరకు సరిచేసుకునే అవకాశాన్ని కల్పించారు. 31 నుంచి హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 10నుంచి 14వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలు అనంతరం రెండు రోజులకు ప్రిలిమినరీ కీ విడుదల చేస్తారు. వాటిలోని అభ్యంతరాలను మరో రెండు రోజులవరకు స్వీకరిస్తారు. వివరాలకు 0891 2531455 లేదా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

ఐసెట్...



ఎంసీఏ, ఎంబీఏ ప్రవేశాలకోసం అనంతపురం ఎస్కేయూ.. ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐసెట్)ను నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ హుస్సేన్‌రెడ్డి, కన్వీనర్‌గా ప్రొఫెసర్ మురళీక్రిష్ణ వ్యవహరిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ 7న ముగిసింది. అయితే 27వరకు ఫైన్‌తో దరఖాస్తు స్వీకరిస్తున్నారు. మే 2నుంచి హాల్ టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 6, 7న పరీక్షలు జరగనున్నాయి. 8న ప్రిలిమినరీ కీ విడుదలచేసి 10 వరకు అభ్యంతరాలను స్వీరించనున్నారు. జూన్ 20న ఫలితాలు విడుదల చేయనున్నారు. వివరాలకు 9000977657 లేదా https://cets.apsche.ap.gov.in/ICET/ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

లాసెట్...




మూడు, ఐదు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సులు. రెండు సంవత్సరాల ఎల్ఎల్ఎం కోర్సుల ప్రవేశాలకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లా, పీజీఎల్ సెట్‌ను నిర్వహిస్తోంది. చైర్మన్‌గా వీసీ రాజశేఖర్, కన్వీనర్‌గా ప్రొఫెసర్ సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఫైన్‌తో మే 29వరకు దరఖాస్తుచేసుకోవచ్చు. వాటిలోని తప్పిదాలను 30 నుంచి జూన్ 1 వరకు సరిదిద్దుకునే అవకాశాన్ని కల్పించారు. 9న నిర్వహించనున్న పరీక్షలకు 3 నుంచే హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 10న ప్రిలిమినరీ కీ విడుదలచేసి 12వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. వివరాలకు 7993788813, 08632346171 లేదా helpdeskaplawcet@apsche.orgకు మెయిల్ చేయాలి.

పీఈసెట్..



వ్యాయామ విద్యలో రెండు సంవత్సరాల బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల ప్రవేశాలను కల్పించేందుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) ఆధ్వర్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంట్రెన్స్ టెస్ట్(పీఈసెట్)ను నిర్వహిస్తున్నారు. చైర్మన్‌గా వీసీ రాజశేఖర్, కన్వీనర్‌గా ప్రొఫెసర్ జాన్సన్ వ్యవహరిస్తున్నారు. అర్హులైన విద్యార్థులనుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 29 వరకు ఫైన్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 4 నుంచి హాల్ టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 11న ఏఎన్‌యూ క్యాంపస్‌లో శారీరక సామర్థ్యం, ఆటల నైపుణ్య పరీక్ష నిర్వహిస్తారు. వివరాలకు 0863-2346218 లేదాhttps://cets.apsche.ap.gov.in/PECETవెబ్‌సైట్‌నుసందర్శించాలి.

ఆర్‌సెట్...



పీజీ కోర్సులు పూర్తిచేసి సంబంధిత కోర్సుల సబ్జెక్టుల్లో ప్రత్యేక పరిశోధనలు చేయడానికి తిరుపతిలోని వెంకటేశ్వర యూనివర్సిటీ ఆధ్వర్యంలో రీసర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఆర్‌సెట్) నిర్వహిస్తున్నారు. చైర్మన్‌గా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, వీసీ శ్రీకాంత్ రెడ్డి, కన్వీనర్‌గా ప్రొఫెసర్ దేవ ప్రసాద్ రాజు వ్యవహరిస్తున్నారు. ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ ప్రాతిపదికన 68 సబ్జెక్టుల్లో అడ్మిషన్ పొందడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి 7వరకు దరఖాస్తులు స్వీకరించారు. 10 నుంచి హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 2 నుంచి 5వరకు పరీక్షలు(తాత్కాలిక) పరీక్షలు నిర్వహిస్తారు. 8న ప్రిలిమినరీ కీ విడుదలచేసి 10వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అర్హత సాధించిన అభ్యర్థుల ఇంటర్వ్యూ 20న ప్రకటిస్తారు. వివరాలకు 9030407022 లేదా https://cets.apsche.ap.gov.in/RCET/ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

మైనర్.. ఓటర్..!

- 18 ఏళ్లు నిండకనే ఓటు హక్కు
- కృష్ణంరెడ్డిపల్లి జాబితాలో బాలలు
- అధికార పార్టీవారిపై టీడీపీ అనుమానం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 8: ఓటరు జాబితాలో అక్రమాలు ఇంకా బయటపడుతూనే ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలంలోని క్రిష్ణంరెడ్డిపల్లిలో మైనర్లకు ఓటు హక్కు కల్పించారు. 16 ఏళ్లు, 17 ఏళ్ల వయసున్నవారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చారు. ఈ అక్రమాల గురించి విపక్ష నాయకులు బీఎల్వోలను ప్రశ్నిస్తే.. తమకేమీ తెలియదని అంటున్నారు. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇస్తున్నారు. ఓటరు నమోదులో బీఎల్వోలే కీలకం. దరఖాస్తులను వీరు పక్కాగా పరిశీలించాలి. క్షేత్రస్థాయిలో విచారించి, వయసు 18 ఏళ్లు, ఆపై ఉన్నట్లు నిర్ధారించుకోవాలి. ఆ తరువాత ఓటరు జాబితాలో చేర్చాలని సిఫార్సు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి అయితేనే ఓటరు జాబితాలో పేరు చేరుతుంది. జిల్లాలో ఓటరు జాబితా అక్రమాలు ఇదివరకే చాలా బయట పడ్డాయి. బాధ్యులపై పలువురు అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది. ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన చేయించి.. సరిచేయించింది. అయినా తప్పులు కొనసాగడం విమర్శలకు తావిస్తోంది. గ్రామంలో తమకు తెలియకుండానే ఓటరు జాబితాలో మైనర్ల పేర్లు చేరాయని బీఎల్వోలు చెబుతుండటం అనుమానాలకు తావిస్తోంది. అధికార పార్టీ నాయకులు పైస్థాయి అధికారులతో మాట్లాడి, నేరుగా ఓటరు జాబితాలో పేర్లను చేర్పించి ఉంటారని కొందరు అంటున్నారు.



మురళి మార్కుల జాబితా, ఓటరు జాబితాలో నమోదైన ఎన్‌డీఎఫ్ నంబరు

17 ఏళ్లకే ఓటు హక్కు

అనంతపురం రూరల్ మండలం క్రిష్ణంరెడ్డిపల్లిలో ఓటరు జాబితాలో జి.వైష్ణవి పేరు నమోదైంది. పదో తరగతి మార్కుల జాబితా ప్రకారం వైష్ణవి 2007, ఏప్రిల్ 30వ తేదీ జన్మించింది. ఆధార్ కార్డులో ఇదే ఏడాది జనవరి 1న పుట్టినట్లు నమోదైంది. ఈ రెండు తేదీల ప్రకారం కూడా తన వయసు 17 ఏళ్లు మాత్రమే. అయినా వైష్ణవి పేరును ఎన్‌డీఎఫ్ 2398592 నంబరు కింద ఓటరుగా నమోదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన జి.చరణ్ పుట్టిన తేదీ.. ఆధార్ కార్డు ప్రకారం 01-01-2006. పదో తరగతి మార్కుల జాబితాలో పుట్టిన తేదీ 22-05-2007 అని చూపించారు. సాధారణంగా పదో తరగతి మార్కుల జాబితాలో పుట్టిన తేదీ ప్రామాణికంగా తీసుకుంటారు. ఆధార్ నమోదు సమయంలో పుట్టిన తేదీలను ఇష్టారాజ్యంగా నమోదు చేయడమే దీనికి కారణం. అయిన 18 ఏళ్లు నిండకనే చరణ్‌కు ఓటు హక్కు కల్పించారు.



వైష్ణవి పది మార్కుల జాబితా, ఓటరు జాబితాలో నమోదైన ఎన్‌డీఎఫ్ నంబరు

ఎన్‌డీఎఫ్ 2398568 నంబరు కింద ఓటరు జాబితాలో చేర్చారు. ఇదే గ్రామానికి చెందిన జి.మురళి పుట్టిన తేదీ.. పదో తరగతి మార్కుల జాబితా ప్రకారం 17-02-2007. అయినా ఓటరు జాబితాలో చేర్చారు. ఎన్‌డీఎఫ్ 2398584 నంబరు కింద ఓటరు కార్డు జారీ చేశారు.

గతంలోనే ఫిర్యాదు..

ఓటరు జాబితాలో అక్రమాలపై ప్రతిపక్ష నాయకులు గతంలోనే మండల అధికారులకు ఫిర్యాదులు చేశారు. రాప్తాడు మండలంలోని చిన్మయనగర్‌లో ఆధార్ కార్డులను మార్చి.. నకిలీ ఓటర్లను జాబితాలో చేర్పించారని, రూరల్ మండలంలో కూడా ఇలాంటివే జరిగాయని, విచారించి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు మండల అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. అధికార పార్టీ నాయకులే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతన్నారని ఫిర్యాదు చేశారు. అధికారులు తమ ఫిర్యాదులను చెత్త బుట్టలోకి వేశారని, అందుకే మైనర్ల పేర్లు ఓటరు జాబితాలో కనిపిస్తున్నాయని టీడీపీ నాయకులు అంటున్నారు.

మా దృష్టికి రాలేదు..

ఓటరు జాబితాలో మైనర్ల పేర్లు ఉన్న విషయం మా దృష్టికి రాలేదు. వయసు తక్కువగా ఉన్నవారికి ఓటు హక్కు ఉండదు. అలాంటివారి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోం.

- పుల్లయ్య, ఏఈఆర్వో

అంగన్‌వాడీలకు జగనన్న మోసాలు..!

- ఐదేళ్ల పాలనలో రూ.వెయ్యి మాత్రమే వేతనం పెంపు
- అమలుకాని సీఎం హామీలు
- తెలంగాణ కన్నా ఎక్కువగా వేతనాలు ఉత్తమాటే..
- ఇతర డిమాండ్లపై దాటవేత
- సమ్మె కాలానికి జీతం చెల్లించని ప్రభుత్వం



ధర్మవరంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

ధర్మవరం, ఏప్రిల్ 8: అంగన్‌వాడీలకు సీఎం జగన్ మోసాలు చేశారంటూ ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. అధికారంలోకి వచ్చాక ఎన్నో హామీలు గుప్పించి.. వాటినీ అటకెక్కించాడు. డిమాండ్ల సాధన దిశగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేపట్టారు. 42 రోజులపాటు ఉధృతంగా కొనసాగించారు. అప్పుడు కూడా ప్రభుత్వ పెద్దలు పలు డిమాండ్లకు అంగీకరించారు. వాటిని కూడా విస్మరించారు. ఇలా.. అంగన్‌వాడీలను జగనన్న అన్ని రకాలుగా మోసగించాడని ఆ వర్గాలు మండిపడుతున్నాయి. ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక మరచిపోయాడు. తెలంగాణలోని అంగన్‌వాడీ సిబ్బంది కంటే ఎక్కువ వేతనం చెల్లిస్తామనీ, ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని పాదయాత్ర సమయంలో ఊరూరా హామీ ఇచ్చాడు. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించాడు. ఐదేళ్లలో ఒకే ఒకసారి రూ.వెయ్యి వేతనం పెంచాడు. తెలంగాణ కంటే ఎక్కువ ఇస్తామన్న హామీని మాత్రం నెరవేర్చలేకపోయాడు.

ఎన్నికల వేళ ఇచ్చిన హామీ

గత సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రంలో పాదయాత్ర చేసిన జగన్ అంగన్‌వాడీ సిబ్బందికి పలు హామీలిచ్చారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి అండగా ఉంటాననీ, సమస్యలను పరిష్కరించడంతోపాటు తెలంగాణలో కంటే రూ.వెయ్యి వేతనం అదనంగా చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించారు. జగన్ అధికారంలోకి రావడానికి ముందు అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.10,500, అయాకు రూ.6వేలు వేతనంగా చెల్లించేవారు. అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఒకసారి మాత్రం రూ.వెయ్యి వేతనం పెంచారు. తెలంగాణ ప్రభుత్వం పీఆర్‌సీని అమలు చేయడంతో అక్కడి అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు పెరిగాయి. ప్రస్తుతం తెలంగాణలో అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.13,500, ఆయాకు రూ.9వేలు చొప్పున చెల్లిస్తున్నారు. ఏపీలో కార్యకర్తకు రూ.11,500, ఆయాకు రూ.7వేలు మాత్రమే ఇస్తున్నారు. జగన్ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే రూ.వెయ్యి అధికంగా వేతనం ఇవ్వాలంటే కార్యకర్తకు రూ.14,500, ఆయాకు రూ.10వేలు చెల్లించాలి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిన పాపానపోలేదు.

ప్రభుత్వం పట్టించుకోవట్లేదు



అంగన్‌వాడీలకు వేతనం తెలంగాణ కంటే రూ.వెయ్యి అదనంగా ఇస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. దీనిపై పలుమార్లు అడిగినా ప్రభుత్వం స్పందించలేదు. ఇతర సమస్యలను పట్టించుకోలేదు. అందుకే అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెకు దిగారు. అప్పట్లో అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదు. సమ్మె కాలానికి జీతం చెల్లించలేదు. ఇతర హామీలకు సంబంధించిన జీఓలు విడుదల చేయలేదు. అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి.

- శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా నేత

ఇతర సమస్యలూ అంతే..

అంగన్‌వాడీలకు సంబంధించి ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తానని జగన్ హామీ ఇచ్చారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలనీ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలనీ, పనిభారం తగ్గించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరుతున్నారు. అధికారంలోకి వచ్చాక జగన్.. వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడంతో గతే ఏడాది డిసెంబరులో నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. 42 రోజులపాటు కొనసాగించారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెతో ఇబ్బందులు తప్పవని భావించిన ప్రభుత్వం.. సంఘం నాయకులతో చర్చలు సాగించింది. పలు డిమాండ్లను అమలు చేయడానికి అంగీకరించింది. వీటిలో రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచుతూ మాత్రమే జీఓ విడుదల చేసింది. మిగిలిన డిమాండ్లకు సంబంధించి జీఓలను విడుదల చేయలేదు. సమ్మె కాలానికి సంబంధించి పూర్తి వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అది కూడా ఇప్పటి వరకు విడుదల చేయలేదు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేస్తామని పాలకులు చెప్పారు. ఇప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు. సమ్మె సమయంలో అన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు ఒక్క డిమాండ్ మాత్రమే నెరవేర్చే దిశగా చర్యలు తీసుకున్నారని అంగన్‌వాడీలు మండిపడుతున్నారు.

జుంజప్పస్వామికి ఘనంగా పూజలు



జుంజప్పస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

గుడిబండ, ఏప్రిల్ 8: కర్ణాటక రాష్ట్రంలోని శిర తాలూకా కళూరుహళ్లి సమీపంలో వెలసిన జుంజప్ప స్వామి, కుర్లహళ్లిభూతప్పస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పూజారిపల్లి, ఎస్‌రాయాపురం, హేమావతి, నాగేపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు సోమవారం జుంజప్పస్వామి ఆలయానికి పెద్దఎత్తున చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పరిశీలించండి: జేసీ



సెక్టోరియల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించుకోవాలని ఆయా సెక్టోరియల్ అధికారులకు జేసీ అభిషేక్‌కుమార్ సూచించారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెక్టోరియల్ అధికారుల సమావేశంలో మాట్లాడారు. హిందూపురం అసెంబ్లీ పరిధిలోని అర్బన్ ప్రాంతంలో దండురోడ్డు, ముద్దిరెడ్డిపల్లి, అరవిందనగర్ పరిధిలోని 25,26,27,28,29 పోలింగ్ బూత్‌లలో ర్యాంపు, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల తహసీల్దార్లు శివప్రసాద్‌రెడ్డి, బాలనరసింహులు, భాగ్యలత, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎన్నికల డీటీ రెడ్డిశేఖర్, ఆర్ఐ అమరేంద్ర, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో జడ్పీటీసీ సభ్యుడి హఠాన్మరణం

నివాళులర్పించిన బీకే, సవిత



జడ్పీటీసీ సభ్యుడు బోయ శ్రీరాములు (ఫైల్)

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 8 : మండలం వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు బోయ శ్రీరాములు(60) సోమవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన ఉదయం స్వగ్రామమైన గుట్టూరు నుంచి పెనుకొండకు వచ్చి ఓ ప్రైవేటు లాడ్జిలో స్నేహితులతో కలిసి మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో ఉన్నఫలంగా హార్ట్‌స్ట్రోక్ రావడంతో కుప్పకూలాడు. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత గుట్టూరుకు చేరుకున్నారు. శ్రీరాములు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళల ర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అలాగే మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యే లు ప్రకాశ్‌రెడ్డి, శంకర్‌నారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, రాష్ట్ర వాల్మీకి సంఘం చైర్మన్ పొగాకు రామచంద్ర తదితరులు శ్రీరాములు భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పట్టణాల్లో ఉగాది సందడి



మడకశిరలో కొనుగోలుదారులతో కిక్కిరిసిన దుస్తుల దుకాణం

పెనుకొండ, ఏప్రిల్ 8 : తెలుగు సంవత్సరాది సందర్భంగా పెనుకొండలో పండగ సంద డి నెలకొంది. స్థానిక శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లోని కూడలిలో పండగకు అవసర మైన పూలు, పండ్లు, కొత్త దుస్తులు, మామిడాకులు, మామిడి కాయలు, టెంకాయ లు కొనడానికి గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలతోపాటు పెనుకొండ ప్రజలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. దీంతో స్థానిక కృష్ణదేవరాయల సర్కిల్, గాంధీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్‌లోని దుకాణాలన్నీ కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.

మడకశిరటౌన్: నూతన తెలుగు సంవత్సరాదిని మంగళవారం ఘనంగా జరుపుకొనేందుకు పట్టణ ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో సరుకులు, బట్టలు, పూలు, పండ్లదుకాణాలు కొనుగోలు దారులతో కిక్కిరిశాయి.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల సమీక్షలో ఎమ్మెల్యే బాలకృష్ణ



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హిందూపురం, ఏప్రిల్ 8 : విడిపోయిన రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, మన పిల్లలకు మంచి భవిష్యతు ఇవ్వాలన్నా టీడీపీ, బీజేపీ జనసేన కూటమి విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని తన నివాసంలో నియోజకవర్గంలోని టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు. మండల కన్వీనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో 35ఏళ్ల అభివృద్ధి ఆగిపోయిందన్నారు. వైసీపీ మరోసారి అధికాంర చేపడితే రాష్ట్రం సర్వనాశనం అవుతుందన్నారు. అన్ని రంగాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికలు యుద్ధం లాంటివన్నారు. మూడు పార్టీలు ప్రజల భవిష్యత్తుకు పోరాడుతుంటే, జగన్మోహన్‌రెడ్డి నాలుగైదు కుటుంబాల లబ్ధి కోసం పోరాడుతున్నారని విమర్శించారు. మనమంతా యుద్ధంలో పాల్గొని ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్లస్టర్ల వారీగా బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ పథకాల కార్యక్రమం ఎంతవరకు జరిగిందనే విషయంపై ఆరాతీశారు. మరీ ముఖ్యంగా నాయకులు, కార్యకర్తలు కలిసి ఉండాలని సూచించారు. మనమంతా ఏకంగా ఉంటేనే ఈ దుర్మార్గుడిని ఇంటికి పంపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన కన్వీనర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఎంఐఎం పార్టీ కౌన్సిలర్

హిందూపురం : పట్టణానికి చెందిన 16వ వార్డు ఎంఐఎం పార్టీ కౌన్సిలర్ మామజిగ్ను టీడీపీలో చేరారు. ఆమెతో పాటు పలువురు టీడీపీ కండువా కప్పుకున్నారు. పట్టణంలోని తన నివాసం వద్ద ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వారుమాట్లాడుతూ టీడీపీ హయాంలో 2014నుంచి 2019వరకు బాలకృష్ణ చేసిన అభివృద్ధి పనులు కరోనా సమయంలో చేసిన సేవలు మరువలేనివని దీంతో టీడీపీలో చేరినట్లు తెలిపారు.

తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యం

ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఏప్రిల్ 8: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లిన పలువురు ఉగాది పండుగ సందర్భంగా తిరిగిరావడంతో సోమవారం ఆయన వారితో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అగళి, రొళ్ల మండలాలకు చెందిన పలువురు హాజరయ్యారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. హంద్రీనీవా జలాలను తెచ్చి ప్రతి చెరువును నింపి స్థానిక రైతుల అభివృద్ధికి పాటు పడుతానన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటుకు పని చేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే స్థానికంగానే పరిశ్రమలు నెలకొల్పుతామని, ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్లిన వారికి నియోజకవర్గంలోనే ఉపాధి పొందే విధంగా చర్యలు చేపడుతామన్నారు. అందరూ సహకరించి తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం పాటు పడాలని కోరారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి :ఎస్పీ

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 8: ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం హిందూపురంలో సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. హిందూపురం సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు సోమవారం సాయంత్రం కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించారు. ఎటువంటి అల్లర్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా శాంతి భద్రతలను కాపాడాలని తెలిపారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ కన్జక్షన్, సీఐలు శ్రీనివాసులు, రియాజ్ అహ్మద్, ఈరన్న, వేణుగోపాల్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కాంగ్రెస్ ప్రచారం

గుడిబండ, ఏప్రిల్ 8 : రాష్ట్రం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కే సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని శంకరగల్లు, రాళ్లపల్లి, జమ్మలబండ, కరెకెర పంచాయతీ గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మండల కన్వీనర్ నాగరాజు, నాయకులు రంగనాథ్, జగదీశ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చెడిపోయిన బోరుకు మరమ్మతులు చేసిన అధికారులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని గుడ్డంపల్లి ఎస్సీ కాలనీలో చెడిపోయిన తాగునీటి బోరుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచు రంగనాథ్ యుద్ధ ప్రాతి పదికన మరమ్మతులు చేయించారు. '2 నెలలైనా... తీరని కష్టం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం పచురితమైన కథనానికి సంబంధిత ఉన్నతాధికారులు స్పందించారు. వెంట నే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సర్పంచు ఆ గ్రామానికి వెళ్లి చెడిపోయిన తాగునీటి బోరుకు మరమ్మతులు చేయించారు. ఆ కానీలకి నీరు అందించారు. దీనిపై కాలనీ వాసులు మాట్లాడు తూ రెండు నెలలుగా తాము తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. చెడిపోయిన బోరును మరమ్మతులు చేయించాలని అనేక సార్లు అధికారులను కోరినట్లు తెలిపారు. అయితే రెండు నెలలుగా అధికారులు స్పందించలేదన్నారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించారన్నారు. దీంతో ఆ కాలనీ వాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు అడ్మిషన్‌లు నిర్వహిస్తే చర్యలు : డీవైఈఓ

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 8: ప్రైవేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని డీవైఈఓ రంగస్వామి హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం విద్యాశాఖ అధికారుల వల్లే ప్రభుత్వ విద్య నాశనం అనే కథనానికి ఆయన స్పందించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎవరైనా ముందస్తు అడ్మిషన్లు చేపట్టినా, ఒంటి పూట బడులు నిర్వహించే సమయం తరువాత తరగతులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

నిర్మానుష్యంగా రహదారులు



పెనుకొండలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్మానుష్యంగా మారిన రహదారి

పెనుకొండ, ఏప్రిల్ 8 : ఎండుతున్న ఎండలు, వడగాల్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పెనుకొండలో సోమవారం 40డిగ్రీల సెంటిగ్రేడ్ నమోదు కావడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 9గంటలకే ఉక్కపోత మొదలవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం 12గంటలైతే ఇంటికే పరిమితం అవుతున్నారు. ఏప్రిల్ నెలలోనే ఇలా ఉంటే మేలో ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

టీడీపీలోకి 60కుటుంబాల చేరిక



సవిత ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 8: అధికార వైసీపీ అరాచకాలు భరించలేక టీడీపీలోకి చేరుతున్నట్లు 60కుటుంబాలు వారు తెలిపా రు. రొద్దం మండలం శేషాపురం, గోరంట్ల మండలం కమ్మవారిపల్లి, వడిగేపల్లి, పంచాయతీ, సోమందేపల్లి మండలం కేతగానిచె రువు, కావేటి నాగేపల్లి నుంచి 60కుటుంబాలు చేరాయి. టీడీపీ స్థానిక కార్యాలయంలో సోమవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత వారికి కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఐదేళ్ల ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

దొంగచాటుగా వైసీపీ రంజాన్ తోఫా పంపిణీ

పలువురు ముస్లిం నాయకుల ఆరోపణ



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 8 : అధికార పార్టీ వైసీపీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో దొంగచాటుగా మైనార్టీలకు రంజాన్‌తోఫా పంపిణీ చేస్తున్నారని పలువురు స్థానిక మైనార్టీ నాయకులు మండిపడ్డారు. వారు సోమవారం పట్టణంలోని దర్గా సమీపంలో విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనార్టీలకు రంజాన్‌తోఫా పంపిణీ చేయలేదన్నారు. కానీ నేడు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ముస్లింల ఓట్లకోసం వారికి రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. ఇదే క్రమంలో పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత నాలుగేళ్లపాటు పబ్లిక్‌గా సమావేశాలు ఏర్పాటుచేసి ముస్లిం మైనార్టీలకు రంజాన్ పండు సందర్భంగా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారన్నారు. ఇప్పటికైనా మైనార్టీలను ఓట్ల కోసం వినియోగించకోకుండా, వారి బాగుకోసం పాటుపడాలని హితవుపలికారు. వైసీపీ తీరుపై మైనార్టీలు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జఫ్రుల్లా, షౌకత్, షామీర్, నజీర్, షమున్, దాదు తదితరులు ఉన్నారు.

టీడీపీకి అండగా నిలుద్దాం

గిరిజనుల నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న గిరిజన నాయకులు

గోరంట్ల, ఏప్రిల్ 8: మండలంలోని తండాలు వాసులైన గిరిజనులు జాగో బంజార నినాదంతో ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలవాలని నిర్ణయించారు. గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం గిరిజనుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండలంలోని 24 తండాల్లో 15వేల గిరిజన జనాభా ఉందన్నారు. రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు, ఇళ్లు, కార్పొరేషన్ రుణాలు తదితర అభివృద్ధి పనులు టీడీపీ పాలనలోనే జరిగాయన్నారు. తండాల్లోని గిరిజనులందరూ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవితకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపట్టా లని నిర్ణయించారు. వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతిఒక్కరు తండాల్లో కృషిచేయాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ రవినాయక్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు షణ్ముఖనాయక్, మాజీ ఎంపీటీసీ చంద్రనాయక్, బంజార నాయకులు లక్ష్మీరాం, రంగల్లానాయక్, శీనానాయక్, తరుణ్, రామస్వామి, కల్యాణ్ తదితరులున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోరంట్ల, ఏప్రిల్ 8: మండలంలోని కర్ణాటక సరిహద్ద ప్రాంతమైన చెట్ల మరంపల్లి శివారుల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. మండలానికి చెందిన అతడు ద్విచక్రవాహనంపై 180 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని తీసుకొస్తుండగా పట్టుకున్నామన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపామన్నారు.

24మంది బైండోవర్

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 8 : వచ్చే నెలలో జరుగబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కియ ఇండస్ట్రియల్ పరిధిలోని వెంకటగిరి పాళ్యం, దుద్దేబండ, చంద్రగిరి తదితర గ్రామాల్లో 24మందిని బైండోవర్ చేసినట్లు పోలీస్ స్టేషన్ ఎస్ఐ రంగడు తెలిపారు. వివిధ కేసుల్లో ఉన్న వారిని బైండోవర్ చేసి సోమవారం తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు ఎస్ఐ ఎ వివరించారు.

ఆసుపత్రిలో సమస్యల కొలువు

- ❖ పీడిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- ❖ తాగునీటి సమస్యతో సతమతం
- ❖ నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంటు



గోరంట్ల ప్రభుత్వాసుపత్రి

గోరంట్ల, ఏప్రిల్ 8: మండకేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్థాయికి తగిన యంత్ర పరికరాలు, వసతులు లేకపోవడంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. అప్‌గ్రేడ్ పీహెచ్‌సీగా మారిన గోరంట్ల ఆసుపత్రి కేవలం ఆరుపడకలతోనే కొనసాగేది. ఈ ఆసుపత్రిని కొన్నేళ్ల కిందట సీహెచ్‌సీగా మార్పు చేశారు. దానికి అనుబంధంగా మరో కోలోకేటుడ్ పీహెచ్‌సీ, కొండాపురం పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. దీంతో సీహెచ్‌లోసీకి ఎనిమిది డాక్టర్ల పోస్టులు మంజూరయ్యాయి. చిన్నపిల్లల వైద్యులు, గైనకాలజిస్టు, దంతవైద్యులు, జనరల్ సర్జన్, జనరల్ ఫిజీషియన్, అనస్థీషియా వైద్యుడితో పాటు మరో ఇద్దరు ఎంబీబీ ఎస్ డాక్టర్లను నియమించారు. దీంతో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ నేతృత్వంలో విస్తృతంగా వైద్యసేవలందిస్తూ వచ్చారు. అవసరమైన వైద్యపరికరాలను ప్రజలు ఉచితంగా ఆసుపత్రికి అందజేస్తూ ప్రోత్సహించారు. దీంతో ప్రభుత్వాసుపత్రిపై ప్రజల్లో నమ్మకం పెరిగి ప్రతిరోజూ 350నుంచి నాలుగు వందలమంది ఓపీలో చికిత్సలు పొందేవారు. ఇన్‌పేషట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. డాక్టర్ శివకుమార్ కృషితో కియ పరిశ్రమవారు ఇటీవల ఆసుపత్రికి 24 ఇనుప మంచాలు, పరుపులు, 40 దుప్పట్లు, రెండు స్ట్రెచర్లు, మూడు వీల్ చైర్లు, రెండు కార్డియాక్ మాని టర్లను అందించారు. అయితే డాక్టర్లకు తగినన్ని ప్రత్యేక గదులు లేకపోవడంతో ఒకే గదిలో నలుగురు వైద్యులు ఓపీ చూసిన సందర్భాలాలున్నాయి. ప్రస్తుతం తగినంతమంది డాక్టర్లు, సిబ్బంది తదితర సమస్యలతో వైద్య సేవలు సరిగా అందడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి.



డాక్టర్ల కొరతతో ఇబ్బందులు

జనవరిలో జనరల్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్, అనస్థీషియా డాక్టర్ అబ్దుల్ సలాం వెళ్లిపోయారు. ప్రవీణ్ ఉన్నతచదువులకు వెళ్లగా జనరల్ సర్జన్ రెగ్యులర్ పోస్టుఖాళీ అయింది. అబ్దుల్‌సలాంకు కణేకల్లు పీహెచ్‌సీలో రెగ్యులర్‌పోస్టు రావడంతో ఆయన ఇక్కడి కాంట్రాక్టును వదులుకున్నారు. అలాగే నెలరోజుల కిందట వైద్యాధికారి శివకుమార్ పదోన్నతిపై హిందూపురం ఆసుపత్రికి వెళ్లారు. ఆ స్థానానికి నియమితులైన చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ కీర్తి మార్చి 24న విధుల్లో చేరారు. అయితే ఆమె ఆ రోజునుంచి ఆసుపత్రికి రాలేదు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ హరీష్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆయన తిరిగి వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ఇటీవల అనస్థీషియాగా డాక్టర్ దానేష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకూడా ఉగాది తరువాత విధులకు వస్తానని వెళ్లినట్లు తెలిసింది. ఇలా వైద్యుల పోస్టులు ఖాళీ కావడంతో ప్రస్తుతం డాక్టర్లు పావని, వినోద్‌కుమార్, ఉష, వేణుగోపాల్ మాత్రమే విధులకు హాజరవుతున్నారు. వారిపై తీవ్ర పనిభారం పడుతున్నట్లు సమాచారం.



నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంటు

తీవ్ర నీటి కొరత

ఆసుపత్రిలో నీటి సౌకర్యం లేకపోవడంతో రోగులతోపాటు వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. పంచాయతీ కొళాయి, బోరు సౌకర్యం ఉన్నా, మోటారు పనిచేయకపోవడంతో నీటి సరఫరా ఆగిపోయింది. నీటి కోసం వైద్య సిబ్బంది సమీపంలోని తెలిసినవారి ఇళ్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నీటిసంపును శుభ్రం చేయని కారణంగా బోరు పనిచేసినా కొళాయి ల్లో మురుగునీరు వస్తోందని సిబ్బంది, రోగులు వాపోతున్నారు.

పనిచేయని ఆక్సిజన్ ప్లాంట్

యేడాది కిందట రోగుల సౌకర్యార్థం ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేసి, వార్డులకు పైపులైన్ సదుపాయం కల్పించారు. అయితే ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా కాని కారణంగా ప్లాంటు వినియోగంలో లేదు. బ్లడ్ స్టోరేజీ సెంటర్ కోసం యంత్రసామగ్రి ఆసుపత్రికి వచ్చినా ప్రారంభా నికి నోచుకోలేదు. హెడ్‌నర్సు, స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీహెచ్‌సీగా పైస్థాయిలో అప్రూవల్ కాకపోవడంతో మెడికల్ లీగల్ కేసులకు ప్రథమచికిత్సలు నిర్వహించి, హిందూపురం పంపాల్సి వస్తోంది.

రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



ఆసుపత్రిలో నలుగురు డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నాం. రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం. డాక్టర్‌కీర్తి విధులకు గైర్హాజరు కావడంతో నోటీసులు జారీ చేశాం. డాక్టర్ హరీష్ నెలరోజులు సెలవుపై వెళ్లారు. డాక్టర్ ప్రవీణ్ పైచదువులకు వెళ్లారు. దీంతో ఆ రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అనస్థీషియా వైద్యుడు దానేష్ రెండురోజుల కిందట విధులకు హాజరై వెళ్లారు. మందుల కొరత లేదు. ఖాళీగా ఉన్న వైద్యుల స్థానాలను భర్తీ చేస్తే, ఎలాంటి సమస్య ఉండదు. మోటారు పనిచేయ కపోవడంతో ఆసుపత్రిలో నీటి కొరత ఏర్పడింది. బ్లడ్ స్టోరేజీ సెంటర్ కోసం ప్లాట్‌ఫారం నిర్మించి, వైరింగ్ చేయాల్సి ఉంది.

- డాక్టర్ పావని, గైనకాలజిస్టు